క్లుప్తంగా

గృహాలకు జియో ట్యాగింగ్

కొయ్యూరు: ప్రభుత్వం ద్వారా మంజూరైన గృహాలకు విధిగా జియో ట్యాగింగ్ చేయాలని ఎంపీడీవో ప్రసాద్ ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సర్వీసులకు సంబంధించి పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని ఆదేశించారు. ఎన్‌పీసీఐ అనుసంధానం ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. అర్హులైన వారికి ఈ శ్రమ్ కార్డులు జారీ చేయాలన్నారు. ఈ ప్రక్రియ వల్ల కలిగే లాభాలను వివరించాలని కోరారు.

ఎంఈవోల సమావేశం

కొయ్యూరు: స్కూల్ కాంప్లెక్స్ స్థానంలో క్లస్టర్ వ్యవస్థ ఏర్పాటు అంశంపై ఎంఈవోలు రాంబాబు, నాగభూషణం, రాజేంద్రపాలెం బాలికల పాఠశాల హెచ్‌ఎం గోపాలం సీఆర్‌పీలతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం ఏడు స్కూల్ కాంప్లెక్స్‌లున్నాయి. వాటి స్థానంలో క్లస్టర్‌ల ఏర్పాటుకు పరిశీలిస్తున్నారు. ఒక్కో క్లస్టర్‌లో ఎన్ని పంచాయతీలుండాలనే విషయంపై ప్రణాళిక చేస్తున్నారు. ఈ ప్రక్రియ ముగియగానే మండల క్లస్టర్ కమిటీని ఏర్పాటు చేసి ఆమోదం తెలపనున్నారు. ఎంఈవో రాంబాబు మాట్లాడుతూ ఒకటి రెండు రోజుల్లో క్లస్టర్ వ్యవస్థను పూర్తి చేస్తామన్నారు.

నిరక్షరాస్యత నిర్మూలనకు కృషి

రంపచోడవరం: మండలంలోని చుప్పరిపాలెం, ఇర్లపల్లి, పెదగెద్దాడ, కందాడ, గంగవరం గ్రామాల్లో ఆరోగ్యభద్రతపై అవగాహన కార్యక్రమాలను మాస్ వెల్ఫేర్ మినిస్ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ బుధవారం నిర్వహించింది. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ సుధీర్ మాట్లాడుతూ నిరక్షరాస్యత నిర్మూలనకు తమ సంస్థ తరఫున విశేష కృషి చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ఏజెన్సీలోని పలు మండలాల్లో గడిచిన పది రోజులుగా స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నట్టు చెప్పారు. అక్షరాస్యతతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. వయోజన విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలన్నారు. పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దరిచేరవన్నారు. పరిసరాల పరిశుభ్రత సామాజిక బాధ్యతగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పెరటి తోట పెంపకానికి అవసరమైన కూరగాయల విత్తనాలు, పండ్ల మొక్కలను ఆయా గ్రామస్తులకు అందజేశారు. గ్రామ మహిళలు స్వయం ఉపాధిపై అవగాహన పెంచుకోవలన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు, గ్రామస్తులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌కార్డుదారులందరికీ ఉపాధి పనులు



మాట్లాడుతున్న ఏపీవో ప్రకాష్

గంగవరం: ఉపాధి హామీ పథకం సిబ్బందితో ఏపీవో ప్రకాష్ వారాంతపు సమీక్ష సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి నెలాఖరు నాటికి ప్రతి పంచాయతీలో 10 నుంచి 15 ఫారంపాండ్లు, 40 ఎకరాల్లో ట్రెంచ్ పనులు, ఒక పశువుల షెడ్డు, ఇంకుడుగుంతల నిర్మాణ పనులు లక్ష్యంగా నిర్ణయించినట్టు చెప్పారు. జాబ్‌కార్డుదారులందరికీ ఉపాధి పనులు కల్పించాలని, కొలతల ప్రకారం, నిబంధనల మేరకు పనులు చేయించి, ప్రతి ఒక్కరికి కూలీ రూ.300 అందజేయాలని సూచించారు. జేఈ పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ నమోదుకు ప్రత్యేక డ్రైవ్



ఆధార్ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఎంపీడీవో కుమార్

అనంతగిరి(అరకులోయటౌన్): మండలంలోని అనంతగిరి సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ క్యాంప్‌ను ఎంపీడీవో కుమార్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరేళ్ల లోపు చిన్నారులను గుర్తించి, వారికి ఆధార్ నమోదయ్యేలా చూడాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు పలు సూచనలిచ్చారు. మండలంలోని ప్రజలంతా బయోమెట్రిక్ అప్‌డేట్, న్యూ ఎన్‌రోల్, డాక్యుమెంట్ అప్‌డేట్‌ను ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లో చేసుకోవచ్చని, సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కుమార్ కోరారు.

దారులు ఇలా.. ప్రయాణం ఎలా?



జీడిపగడ రహదారి దుస్థితి



గుద్రుమెట్టలో అధ్వానంగా రహదారి

- అధ్వానంగా జీడిపగడ రహదారి
- అసంపూర్తిగా పనులు
- గ్రామస్తులకు తప్పని అవస్థలు
- పట్టించుకోని అధికారులు

ఏజెన్సీలో చాలా ప్రాంతాల్లో దారులు అస్తవ్యస్తంగా దర్శనమిస్తున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన నిధులతో చేపట్టాల్సిన పనులు ఎన్నికల కోడ్ వల్ల నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మన్య ప్రాంతంపై కనీస దృష్టి సారించ లేదు. నిధులున్నా .. అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తి చేయడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల గిరిజనుల పాలిట శాపంగా మారింది. అధ్వాన రహదారుల వల్ల రవాణా సదుపాయం కరువైంది. అత్యవసర సేవలైన 108 కూడా గ్రామాలకు రాని పరిస్థితి నెలకొంది. రోగులకు డోలీమోతలే శరణ్యమైంది. సమస్య పరిష్కారంపై ఇటు ప్రభుత్వం..అటు అధికారులు పట్టించుకోకపోవడంతో అడవిబిడ్డలు పడుతున్న ఇక్కట్లు వర్ణనాతీతం.



నిరుపయోగంగా పైపులు

పాడేరు రూరల్: మండలంలోని వనుగుపల్లి పంచాయతీ జీడిపడగ నుంచి జి.మాడుగుల మండలం వంతల పంచాయతీ వరకు రహదారి అధ్వానంగా మారింది. ఈ మార్గంలో పెద్ద పెద్ద గోతులతో పాటు రాళ్ల తేలి దారుణంగా దర్శనమిస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హాయంలో ఈ రహదారి నిర్మాణానికి రూ.70లక్షల నిధులు మంజూరైంది. అప్పట్లో పనులు వేగవంతంగా చేపట్టారు. ఈ మార్గంలో కొంత వరకు పనులు చేపట్టిన కాంట్రాక్టర్ అసంపూర్తిగా వదిలేశాడు. అధికారుల నిర్లక్ష్యం వల్ల కాంట్రాక్టర్ అస్తవ్యస్తంగా పనులు చేపట్టారు. ఇదిలా ఉండగా ఎన్నికల కోడ్ రావడంతో ఎక్కడికక్కడ పనులు నిలిచిపోయాయి. అసంపూర్తి రహదారితో ఈ మార్గం అధ్వానంగా మారింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, తుపానుల వల్ల రాళ్ల తేలి, పెద్ద పెద్ద గోతులతో నిండి ఉంది. గతంలో పనులు చేపట్టిన కాంట్రాక్టర్ ఈ మార్గంలో పలుచోట్ల కల్వర్టు తదితర ప్రాంతాల్లో పైపులను ఏర్పాటుచేయకుండా వదిలేయడంతో అవి ప్రమాదకరంగా మారాయి. రహదారిపై పైపులు అస్తవ్యస్తంగా వదిలేయడంతో వాహనచోదకులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారని పలువురు ఆందోళన చెందుతున్నారు. రాళ్ల తేలి అధ్వానంగా ఉన్న దారిలో ప్రయాణం ప్రమాదకరంగా ఉందని, రాత్రిళ్లు మరింత కష్టంగా మారిందని వాహనచోదకులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అధ్వాన రహదారి వల్ల రవాణా సౌకర్యం కరువైందని, అత్యవసర సేవలు 108, 104 రాని పరిస్థితి నెలకొందని, రోగులకు డోలీమోతలే శరణ్యమైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చొరవతోనే రహదారికి మోక్షం

దశాబ్దాల తరువాత మన్యంలో రహదారులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే మోక్షం కలిగింది. నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మన్యంలో ప్రతి ప్రాంతం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి నిధులు మంజూరు చేశారని, దీంతో గ్రామాల్లో కనీస సదుపాయాల పనులు జరిగాయని స్థానిక గిరిజనులు చెబుతున్నారు. ఇందులో భాగంగా జీడిపగడ రహదారి ఏర్పాటుకు బీజం పడిందని, అయితే అధికారుల నిర్లక్ష్యం కాంట్రాక్టర్ అలసత్వం వల్ల పనులు నిలిచిపోయాయంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు పైబడినా తమ ప్రాంతంలోని అసంపూర్తిగా ఉన్న రహదారి పనులపై కనీసం దృష్టి సారించలేదని చెబుతున్నారు. ఈ రహదారి పూర్తయితే సుమారు 15 గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందంటున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న రహదారి పూర్తి చేయాలని వారు కోరుతున్నారు.

చిత్తడి దారితో సతమతం

ముంచంగిపుట్టు: మండలంలోని కుమడ పంచాయతీ గుద్రుమెట్ట గ్రామంలో సీసీ రోడ్డు వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామంలో మట్టి రోడ్లతో అధ్వానంగా ఉన్నాయని, వర్షం పడితే చిత్తడిగా మారుతున్నాయని దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని రహదారి కోసం పలుమార్లు పాడేరు గ్రీవెన్స్‌లో కలెక్టర్, ఐటీడీఏ పీవోలకు వినతులిచ్చినా స్పందన లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి సీసీ రోడ్డు వేసేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

మా కష్టాలు తీరేనా



నాడు జగనన్న ప్రభుత్వ హయాంలోనే మా గ్రామాల్లో అభివృద్ధి పనులు జరిగాయి. గ్రామానికి రహదారి మంజూరైందని ఆశపడ్డాం. కాని ఆశ మూన్నాళ్ల ముచ్చటైంది. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా నేటి వరకు పనులు ముందుకు సాగలేదు. మా గ్రామస్తులకు రహదారి కష్టాలు తీరేదెన్నడో.

–పాంగి వాసు, జీడిపగడ, పాడేరు మండలం

అధికారులు స్పందించాలి



రహదారి సౌకార్యం లేక చాలా ఇబ్బందులు పడుతున్నాం. రాళ్లు తేలి, గోతులమయంగా ఉన్న రహదారి వల్ల నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. అత్యవసర సమయాల్లో గ్రామానికి అంబులెన్స్ వచ్చే పరిస్థితి లేదు. దీంతో రోగులకు డోలీమోతలతోనే తరలించాల్సి వస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పనులు పూర్తి చేయాలి.

–ముచ్చుల మల్లన్న, బి.కొత్తూరు, పాడేరు మండలం

ప్రతిపాదనలు పంపాం

మండలంలో అసంపూర్తిగా ఉన్న జీడిపగడ రహదారి పనుల కోసం ప్రతిపాదనలు పంపాం. యంత్రాంగం నుంచి ఆదేశాలు వచ్చిన తరువాత పనులు ప్రారంభిస్తాం. త్వరితగతిన పనులు పూర్తి చేసి, రహదారి అందుబాటులో వచ్చేందుకు చర్యలు తీసుకుంటాం.

–రవికుమార్, ట్రైబల్ వెల్ఫేర్, డీఈ, పాడేరు

సేవతోనే సంపూర్ణ ఆనందం



పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న స్వచ్ఛంద సేవ సంస్థ ప్రతినిధులు

మారేడుమిల్లి: మండలంలోని కడుమూరు గ్రామంలో గిరిజనులకు దుస్తుల పంపిణీ కార్యక్రమం బుధవారం జరిగింది. కొవ్వూరుకు చెందిన రూత్ రోజీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మారిశెట్టి శ్రీనివాసరావు చేతుల మీదుగా పేదలకు దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవతోనే సంపూర్ణ ఆనందం కలుగుతుందన్నారు. పేదలకు నిస్వార్థంగా సేవలందించేందుకు అందరు ముందుకు రావాలని కోరారు. ఏజెన్సీలో తమ సంస్థ తరుపున విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. రంపచోడవరం మండలం సురక్ష క్లినిక్ డాక్టర్ చిన్నం సిల్వస్టర్, జీడీఎం చర్చి పాస్టర్ జానార్థన్, సంస్థ ప్రతినిధులు నరేష్, జగదీష్, సురేంద్ర, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి సాయం



బాధిత కుటుంబానికి నగదు, నిత్యావసర సరకులు అందజేస్తున్న నాయకులు

అడ్డతీగల: అడ్డతీగలలో ఈనెల 20 జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలిన పుడిగి మాణిక్యం కుటుంబానికి రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషాదేవి, ఆమె భర్త విజయభాస్కర్ రూ.10 వేలు నగదు, నిత్యావసర సరకులను బుధవారం కూటమి నాయకుల ద్వారా అందించారు. బాధిత కుటుంబానికి పక్కా ఇల్లు నిర్మించడానికి కృషి చేయనున్నట్టు తెలిపారు. తహసీల్దార్ సూర్యారావు, నాయకులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం



నగదు సాయం అందిస్తున్న దాతలు

ఎటపాక: మండలంలోని పాలమడుగు, గన్నేరుకొయ్యపాడు గ్రామాల్లో బుధవారం అనారోగ్యంతో మరణించిన ఇద్దరు వ్యక్తుల కుటుంబానికి దాతలు ఆర్థిక సాయం అందించారు. గన్నేరుకొయ్యపాడులో యన్నం రామకృష్ణ ,పాలమడుగులో తాటి ముత్తయ్య అనారోగ్యంతో మృతి చెందారు. నిరుపేద కుటుంబానికి చెందిన వారు కావడంతో జమాల్‌ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ నుంచి ఒక్కో కుటుంబానికి రూ.3వేలు చొప్పున నగదు అందించారు. వైస్ ఎంపీపీ మంగేశ్వరరావు,కణితి మధు, సురేష్,భద్రయ్య, శ్రీను, పుల్లారావు పాల్గొన్నారు.

బాలికల సంరక్షణకు ప్రాధాన్యం

పాడేరు : బాలికలను రక్షించాలని..చదువు చెప్పించాలని ఐసీడీఎస్ ఏపీడీ ఎస్తేర్ రాణి స్పష్టం చేశారు. బేటీ బచావో.. బేటి పడావో కార్యక్రమం సందర్భంగా కేంద్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వెబ్‌కాస్ట్ లింక్ ద్వారా స్థానిక కలెక్టరేట్‌లో ఐసీడీఎస్ ద్వారా నిర్వహించారు. మహిళలకు రక్షణ, విద్యకు మద్దతిస్తూ ఆడపిల్లలకు సమాజంలో అన్ని రంగాల్లో ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు.బాలికల సంరక్షణకు ప్రాధాన్యమివ్వాలన్నారు. బాలికలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. అనంతరం ఆడ పిల్లలను రక్షించాలని కోరుతూ పలు శాఖల అధికారులు ప్రతిజ్ఞ చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి డాక్టర్ రోహిని, స్పోర్ట్స్ అథారిటీ అధికారి ఎ.జగన్‌మోహన్‌రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పశువ్యాధులపై అప్రమత్తం



చెరకుంపాలెంలో మేకలకు నట్టల నివారణ మందు వేస్తున్న ఏడీ గణేష్, సిబ్బంది



అడ్డతీగలలో పశువులకు వ్యాధి నివారణ మందు వేస్తున్న సిబ్బంది

అడ్డతీగల: మండలం భీముడుపాకలు గ్రామంలో బుధవారం నిర్వహించిన పశు ఆరోగ్య శిబిరంలో 62 పశువులు 190 కోళ్లకు చికిత్సలు చేసినట్టు పశుసంవర్ధకశాఖ ఏడీ సీహెచ్.గణేష్ చెప్పారు. పశువులకు వ్యాధి నివారణ మందులు, కోళ్లకు టీకాలు వేశామన్నారు. పశువ్యాధులపై పాడిరైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పలు అంశాలపై అవగాహన కల్పించారు.ఈ సర్పంచ్ కోసూరి రామిరెడ్డి, పశుసంవర్ధకశాఖ లైవ్‌స్టాక్ అసిస్టెంట్ ఐ.వెంకటరావు, ఏహెచ్ఎలు శేఖర్, వినోద్, వెంకటేశ్వర్లు, శ్రీనుబాబు, నాగరాజు, సుధారాణి, మహాలక్ష్మి, నరమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మండలంలో చెరకుంపాలెంలో జరిగిన పశు వైద్య శిబిరాన్ని పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్.గణేష్ బుధవారం పర్యవేక్షించారు. మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందు ఏ విధంగా వేయాలో సిబ్బందికి సూచించారు. కోళ్లకు రోగనిరోధక మందులు ఇచ్చారు. రైతులు, సర్పంచ్ నాగేశ్వరరావు, వెటర్నరీ డాక్టర్ తరుణ్, సిబ్బంది లక్ష్మణరావు, వీరబాబు, సుబ్బరాజు, రమణ, చిన్నయ్య, వెంకటేష్, రవికుమార్ పాల్గొన్నారు.

సాగుపై రైతులకు సూచనలు

చింతపల్లి: తాజంగి, లంబసింగి పంచాయతీల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారి మధుసూదనరావు మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక వ్యవసాయ పద్ధతులపై దృష్టి సారించాలని. ఆధునిక సేద్యంతో అధిక లాభాలు పొందవచ్చన్నారు. రైతులకు ఆధార్ తరహాలో ప్రత్యేక సంఖ్యతో కూడిన గుర్తింపు కార్డులను జారీ చేస్తామన్నారు.

గృహ నిర్మాణానికి నిధులు పెంచాలని డిమాండ్



తహసీల్దార్ కార్యలయం ఎదుట నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు, గిరిజనులు

అరకులోయటౌన్: మన్యంలోని పీవీటీజీలకు పీఎం జన్‌మన్ హౌసింగ్ యూనిట్ కాస్ట్ రూ. 5 లక్షలకు పెంచాలని కోరుతూ బుధవారం అరకులోయలో సీపీఎం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ ఎంవీవీ ప్రసాద్‌కు వినతపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి కిండంగి రామారావు, నాయకుడు చినబాబు మాట్లాడారు. ఆదివాసీల ఇళ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న రూ. 2.39 లక్షలు పనులకు సరిపడవని, దీన్ని రూ.5లక్షలకు పెంచాలని కోరారు. కొండకోనల్లో ఇళ్ల నిర్మాణ సామగ్రి తరలించేందుకు రవాణా చార్జీలు రెండింతలు అవుతున్నాయని, దీంతో ఇళ్ల పూర్తి స్థాయిలో నిర్మించలేని పరిస్థితి ఉందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని పీఎం జన్‌మన్ హౌసింగ్ యూనిట్ కాస్ట్ రూ.5లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. నాయకులు బుజ్జిబాబు, సత్యారావు, నితీష్, శ్రీను, ఆనంద్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లలోపు చిన్నారులకు ఆధార్ నమోదు



చిన్నారులకు ఆధార్ నమోదు చేస్తున్న పోస్టల్ సిబ్బంది, ఐసీడీఎస్ అధికారులు

అడ్డతీగల: ఐదేళ్లలోపు చిన్నారుల వివరాలను శిశు ఆధార్‌లో నమోదు చేయాలని అడ్డతీగల ఐసీడీఎస్ సీడీపీవో వై.సుధ తెలిపారు. ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ అధికారులతో కలసి బుధవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ఐదేళ్లలోపు చిన్నారులకు శిశు ఆధార్‌లో వివరాలు నమోదు ప్రక్రియను నిర్వహించారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రం పరిధిలోనూ ఐదేళ్లలోపు చిన్నారుల నమోదు ప్రక్రియ జరుగుతుందన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు ప్రజలకు ఈ విషయాన్ని తెలియజేసి వంద శాతం కార్యక్రమం విజయవంతానికి కృషి చేయాలన్నారు. ఆధార్ నమోదు ఉచితంగా చేస్తారన్నారు. ఆధార్ కార్డుతో మొబైల్ నెంబర్ లింక్‌కి సంబంధించి రూ.50 చెల్లించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ప్రతి ఒక్క చిన్నారి వివరాలు నమోదు చేయించుకోవాలన్నారు. ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ సీనియర్ మేనేజర్ కె.రాజేష్‌కుమార్, మేనేజర్ బాలాజీ, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన చట్టాలు పక్కాగా అమలు చేయాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు చిన్నస్వామి

డుంబ్రిగుడ: గిరిజన చట్టాలు పక్కాగా అమలుచేయాలని, ఐటీడీఏ పరిధిలో ఖాళీ ఉన్న పోస్టులను గిరిజన నిరుద్యోగులచే భర్తీ చేయాలని అరకు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు పాచిపెంట చిన్నస్వామి డిమాండ్ చేశారు. మండలంలోని కించుమండ వారపు సంతను నాయకులతో కలిసి ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంతలో తాగునీరు, మరుగుదొడ్లు తదితర మౌలిక సదుపాయాలు లేవన్నారు. సంతకు వివిధ ప్రాంతాల నుంచి గిరిజన రైతులు తీసుకొస్తున్న అటవీ, వ్యవసాయ ఉత్పత్తులు భద్రపరచుకోవడాని షెడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి, ప్రభుత్వం స్పందించి సంతలో మౌలిక సదుపాయాలపై కల్పనపై దృష్టి సారించాలన్నారు. జీవో నెంబర్ 3ని చట్టబద్ధత కల్పించి, గిరిజన అభ్యర్థుల కోసం ప్రత్యేక డీఎస్సీ ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. ఏపీ ఆదివాసీ కాంగ్రెస్ కో–ఆర్డినేటర్ సోమేశ్వరరావు, నాయకులు ప్రశాంత్, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

అరకు పైనరీలో విద్యుత్ సౌకర్యం కల్పించాలి



వ్యాపారులతో మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ గంగాధర్

డుంబ్రిగుడ: అరకు పైనరీ వద్ద విద్యుత్ సౌకర్యం కల్పించాలని కొర్రాయి పంచాయతీ మాజీ సర్పంచ్ గంగాధర్ డిమాండ్ చేశారు. అంజోడీ సిల్క్ ఫారం పైనరీని ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం వ్యాపారులతో మాట్లాడుతూ మండలంలోని కొర్రాయి పంచాయతీ పరిధిలో ఉన్న అంజోడా సిల్క్ ఫారం అరకు పైనరీలో అటవీ శాఖ అధికారులు అభివృద్ధి చేసినా విద్యుత్ సదుపాయంపై దృష్టి సారించలేదన్నారు. పర్యాటకులతో నిత్యం కళకళలాడుతుందని, సాయంత్రం 6 గంటలు దాటిన తరువాత చీకటిమయం అవుతుందని, పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీంతో ఇక్కడ మరుగుదొడ్లు, రన్నింగ్ వాటర్ సౌకర్యం కల్పించాలని కోరారు.

ఐటీడీఏ పీవో దృష్టికి సమస్యలు



ఐటీడీఏ పీవో అపూర్వ భరత్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీపీ రంగమ్మ

కూనవరం: మండలంలోని కొండ్రాజుపేట, చినార్కూరు పంచాయతీల్లో నెలకొన్న పలు సమస్యలను స్థానిక ఎంపీపీ పాయం రంగమ్మ బుధవారం చింతూరు ఐటీడీఏ పీఓ అపూర్వ భరత్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. ఇందులో భాగంగా అంతర్గత రోడ్ల నిర్మాణం చేపట్టాలని కోరారు. జిన్నెలగూడెం చెరువు మరమ్మతు పనులతో పాటు అసంపూర్తిగా ఉన్న బీటీ, సీసీ రోడ్లు నిర్మించాలని వినతిలో పేర్కొన్నారు. టేకులబోరు నుంచి కొండ్రాజుపేట వరకు, కొండ్రాజు నుంచి చినార్కూరు, చినార్కూరు నుంచి పెదార్కూరు, పెదార్కూరు నుంచి రేపాక, రేపాక నుంచి రేపాక బస్‌షెల్టర్ వరకు బీటీ రోడ్లు నిర్మించాలని, కొండ్రాజుపేటలో సీసీ రోడ్డు వేయాలని, తెల్లవారి గుంపు నుంచి శబరి కొత్తగూడెం వరకు అసంపూర్తిగా ఉన్న బీటీ రోడ్డును పూర్తి చేయాలని కోరారు. జిన్నెలగూడెం చెరువు మరమ్మతులు చేపట్టి రెండు గేట్లు ఏర్పాటు చేస్తే గిరిజన రైతులకు మేలు జరుగుతుందని కోరారు. కాగా ఆయా సమస్యలపై పీవో భరత్ సానుకూలంగా స్పందించినట్టు ఎంపీపీ పాయం రంగమ్మ తెలిపారు.

కాంట్రాక్టర్, అధికారులపై చర్యలు తీసుకోవాలి



అధ్వానంగా ఉన్న రోడ్డును పరిశీలిస్తున్న ఎంపీపీ వరహాలమ్మ తదితరులు

పెదబయలు: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా మారుమూల రూడకోట నుంచి జామిగుడ వయా ఒడిశా బోర్డర్ వరకు తారురోడ్డు నిర్మాణం చేపట్టిందని, ఏడాది కాకుండా రోడ్డు శిథిలావస్థకు చేరుకుందని పెదబయలు ఎంపీపీ బొండా వరహాలమ్మ, వైస్ ఎంపీపీ కొర్రా రాజుబాబు, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కె.బొంజుబాబు అన్నారు.మండలంలోని రూడకోట నుంచి జామిగుడ మీదుగా ఒడిశా సరిహద్దు వరకు నిర్మించిన తారురోడ్డు పనులను ఆమె బుధవారం పరిశీలించారు.గతేడాది రూడకోట నుంచి ఒడిశా సరిహద్దు వరకు రూ.15 కోట్లతో రోడ్డు నిర్మాణం జరిగిందని, అయితే ఏడాది కాకుండానే రోడ్డు రాళ్ల తేలి అధ్వానంగా దర్శనమిస్తోందన్నారు. దశాబ్దాల కాలం నిరీక్షణ తరువాత నిర్మాణం జరిగిన రోడ్డు నాసిరకంగా వేయడంతో ప్రస్తుతం స్థానికులు తారురోడ్డు వచ్చిందనే సంతోషం కొంతకాలానికే పరిమితమమైందన్నారు. రూడకోట నుంచి కుమడ. కుమడ నుంచి జామిగుడ ఒడిశా సరిహద్దు వరకు రోడ్డు అధ్వానంగా ఉందని ఈ విషయంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. వెంటనే తారురోడ్డు పనులు చేపట్టాలన్నారు. అలాగే రోడ్ల నిర్మాణంలో కాంట్రాక్టర్, పర్యవేక్షణ చేయాల్సిన ఇంజినీర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుండా స్థానికులతో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

పాడేరు : ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని లేని పక్షంలో ఆందోళన చేస్తామని పారిశుద్ధ్య కార్మికుల సంఘం నాయకురాలు ముత్యాలమ్మ తెలిపారు. సీఐటీయూ నాయకులతో కలిసి పారిశుద్ధ్య కార్మికులు బుధవారం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వమిత్రకు అందజేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి సుందర్‌రావు మాట్లాడుతూ పాడేరు జిల్లా ఆస్పత్రితో పాటు చింతపల్లి, అరకు, ముంచంగిపుట్టు ఏరియా ఆస్పత్రుల్లో గత 20 ఏళ్లగా పారిశుద్ధ్య కార్మికులు చాలీచాలని వేతనాలతో వెట్టి చాకిరీ చేస్తున్నారన్నారు. వారికి కనీస వేతనం రూ.26వేలు చెల్లించాల్సి ఉండగా ప్రస్తుతం కేవలం రూ.11,200 మాత్రమే ఇస్తోందన్నారు. వివిధ కారణాలతో తొలగించిన వారిని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని లేని పక్షంలో ఆస్పత్రుల ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు. ఘాటీలమ్మ, రాజేశ్వరి, సింహాచలం, నగేష్, చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.